క్లుప్తంగా

రైతుబజార్లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు... (కిలో... రూపాయల్లో) టమాటా 63, వంకాయ 23, బెండ 28, పచ్చిమిర్చి 65, కాకర 32, బీర 28, క్యాబేజీ 15, ఫ్రెంచి బీన్స్ 75, క్యారెట్ 55, దొండ 13, చిక్కుడు 65, గోకర 23, బీట్‌రూట్ 23, క్యాప్సికం 75, ఆలు 20, దోస 13, సొర 11, పొట్ల 13, ఉల్లిగడ్డ 19, చామగడ్డ 37. ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

బాధ్యతలు తీసుకున్న నూతన డీసీలు


హయత్‌నగర్ సర్కిల్ డీసీగా బాధ్యతలు తీసుకుంటున్న రవికుమార్

ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్ మూడు సర్కిళ్ల పరిధిలోని రెండు సర్కిళ్లకు గురువారం నూతన డీసీలు బాధ్యతలు తీసుకున్నారు. సరూర్‌నగర్ సర్కిల్ డీసీగా పని చేస్తున్న కృష్ణయ్య బదిలీపై కూకట్‌పల్లి వెళ్లగా, ఆయన స్థానంలో ఉప్పల్ డీసీగా పని చేస్తున్న అరుణకుమారిని నియమించారు. హయత్‌నగర్ డీసీగా పని చేస్తున్న మారుతిదివాకర్‌ను అంబర్‌పేట సర్కిల్ కార్యాలయానికి బదిలీ చేయగా, ఆయన స్థానంలో కూకట్‌పల్లి సర్కిల్ డీసీగా పని చేస్తున్న రవికుమార్‌ను నియమించారు. అరుణకుమార్, రవికుమార్‌లు గురువారం బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సర్కిల్ పరిధిలోని డివిజన్ల అభివృద్ధికి కృషి చేస్తామని, సమస్యలు వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బాలికను ఈవ్‌టీజింగ్ చేసిన యువకుడికి జైలు

చాదర్‌ఘాట్: బాలికను ఈవ్‌టీజింగ్ చేసిన యువకుడికి న్యాయస్థానం జైలుశిక్ష విధించిన ఘటన చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ ప్రకాష్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... చైతన్యపురి కొత్తపేటకు చెందిన మోహన్‌కుమార్ (21) మలక్‌పేట గంజ్‌లో నివసిస్తున్న బాలిక ఇంటికి ప్రతిరోజూ వచ్చి వేధిస్తున్నాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడ్ని కోర్టులో హాజరు పర్చగా, నాంపల్లి 6వ స్పెషల్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు నిందితుడికి 8 రోజులు జైలు శిక్ష విధించినట్లు సీఐ తెలిపారు.

వృద్ధురాలి అదృశ్యం
గంటల వ్యవధిలోనే ఆచూకీ కనుగొన్న పోలీసులు


వృద్ధురాలిని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న సీఐ జలేంధర్‌రెడ్డి

హస్తినాపురం: మతిస్థిమితం సరిగా లేని ఓ వృద్ధురాలు అదృశ్యం కాగా, గంటల వ్యవధిలోనే పోలీసులు ఆమె ఆచూకీ కనుగొని కుటుంబసభ్యులకు అప్పగించారు. వనస్థలిపురం సీఐ జలేంధర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... వనస్థలిపురం నివాసం ఉండే వృద్ధురాలు వెంకట సుబ్బమ్మకు మతిస్థిమితం సరిగ్గా ఉండదు. గురువారం ఉదయం ఆమె ఇంటి నుంచి ఎటో వెళ్లిపోయింది. కుటుంబసభ్యులు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన వనస్థలిపురం పోలీసులు పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో ఆమె ఫొటో ఆధారంగా గాలింపు చర్యలు చేపట్టారు. సీసీ కెమెరాల ఆధారంగా వనస్థలిపురం పెట్రో మొబైల్ వాహనం ఇన్‌చార్జి ఏఎస్‌ఐ వేణుగోపాల్, ఆయన సిబ్బంది వృద్ధురాలి ఆచూకీని సాయంత్రానికి కనుగొన్నారు. ఆమెను పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. అనంతరం సీఐ జలేంధర్‌రెడ్డి వృద్ధురాలి కుటుంబ సభ్యులను స్టేషన్‌కు పిలిపించి వారికి అప్పగించారు.

ఘనంగా కాటమయ్య బోనాలు


ఉత్సవాల్లో పాల్గొన్న నాగోలు గ్రామస్తులు

నాగోలు: నాగోలులో గురువారం గౌడ కులస్తులచే శ్రీ కంఠమహేశ్వర స్వామి (కాటమయ్య) బోనాల ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. కార్యక్రమంలో నాగోల్ గ్రామ పెద్దలు, గౌడ కులస్తులు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

చుక్కలు చూపిస్తున్న వాన

- ఒకవైపు ట్రాఫిక్ జామ్‌లు
- మరోవైపు ముంపునకు గురవుతున్న ఇళ్లు
- ఆవేదన వ్యక్తం చేస్తున్న కాలనీవాసులు


పైకాలనీల నుంచి వస్తున్న వరద నీరు సరస్వతినగర్‌కాలనీ రోడ్డుపై పారుతున్న దృశ్యం

ఎల్‌బీనగర్: ఇన్నాళ్లూ ఎండలకు బెంబేలెత్తిన జనం ఇప్పుడు చిన్నపాటి వర్షానికే భయపడాల్సిన దుస్థితి నెలకొంది. ట్రాఫిక్‌లో ఉన్నప్పుడు వానొస్తే ..ఇంతే సంగతులు. ఓ వైపు ట్రాఫిక్ జామ్ ఇబ్బందులు పెడితే, మరోవైపు లోతట్టు కాలనీల్లోని ఇళ్లు, రహదారులు వరద ముంపునకు గురికావడం కాలనీవాసుల సహనానికి పరీక్ష పెడుతున్నాయి.

- ఎల్‌బీనగర్ నియోజకవర్గ పరిధిలోని పలు డివిజన్లలో ప్రారంభించిన టాక్స్‌టైప్ వరద నీటి కాలువలు నత్తనడకన సాగటం, వరద నీరు సాఫీగా వెళ్లేందుకు ముందస్తు ఏర్పాటు చేయకపోవడంతో రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పలు లోతట్టు కాలనీలలో వరదనీటి ముంపు సీన్ రిపీట్ అవుతోంది.
- లింగోజిగూడ డివిజన్ అల్తాఫ్ నగర్, జనప్రియ కాలనీల ప్రధాన రహదారులు వరదనీటితో మునిగిపోయాయి. దీంతో కాలనీవాసులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
- నాగోల్ పరిధిలోని ఆనంద్‌నగర్ కాలనీలో రహదారిపై వరద నీరు నిలిచి ప్రయాణికులు ఇబ్బందులుఎదుర్కొనగా..బండ్లగూడలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి రహదారులు గుంతలమయంగా మారాయి.
- మన్సూరాబాద్ డివిజన్ సౌత్ అండ్ పార్కు, సరస్వతీనగర్ కాలనీలోని లోతట్టు ఇళ్లలోకి వరద చేరటంతో వారి కష్టాలు వర్ణణాతీతంగా మారాయి
- చంపాపేట డివిజన్ పరిధిలోని మల్‌రెడ్డినగర్, ఉదయ్‌నగర్, పద్మానగర్ కాలనీలలో ఎగువ కాలనీల నుంచి వస్తున్న వరదతో రహదారులన్నీ జలమయం అయ్యాయి.
- వర్షాకాలం కంటే ముందు వరదనీటి కాలువల పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి ఉంటే ఈ ఇప్పుడు ముంపు సమస్య తలెత్తేది కాదని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి వరదనీటి మళ్లింపు చర్యలు చేపట్టాలని బాధిత కాలనీవాసులు కోరుతున్నారు.


భారీ వర్షానికి గుంతలు పడ్డ బండ్లగూడలోని రహదారి


నాగోలు డివిజన్ సౌత్‌ఎండ్‌పార్కుకాలనీలో రోడ్లపై పారుతున్న వరదనీరు


ఎల్‌బీనగర్ రాజీవ్‌గాంధీ ఫ్లైవర్ వద్ద నిలిచిన వరద నీరు

ముంపు ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


హస్తినాపురంలోని వరద ముంపు ప్రాంతాల్లో పర్యటిస్తున్న కార్పొరేటర్ సుజాతానాయక్

హస్తినాపురం: వరద ముంపు ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని. ఎలాంటి సమస్య వచ్చినా వెంటనే జీహెచ్‌ఎంసీ హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించాలని హస్తినాపుం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతా నాయక్ అన్నారు. గురువారం రాత్రి డివిజన్ పరిధిలోని భీమానగర్‌కాలనీ, సాగర్ ఎన్‌క్లేవ్‌కాలనీ, రెడ్డి కాలనీ, ద్వారకాతిరుమల కాలనీల్లోని లోతట్టు ప్రాంతాల్లో అధికారులతో కలిసి పర్యటించారు. వరద నీటి వల్ల ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, ఇళ్లలోకి నీరు చేరకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆమె కోరారు. కార్పొరేటర్‌తో పాటు జీహెచ్‌ఎంసీ డిప్యూటీ ఇంజినీర్ కనకయ్య, ఏఈ హేమూనాయక్, బీఆర్‌ఎస్ నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి , రామచంద్ర నాయక్, వివిధ కాలనీల ప్రతినిధులు ఉన్నారు.

లోతట్టు ప్రాంతాల్లో పర్యటించిన ట్రాఫిక్ డీసీపీ

మలక్‌పేట: వర్షాలకు మలక్‌పేటలోని లోతట్టు ప్రాంతాల్లో నీరు చేరింది. సౌత్ ఈస్ట్ ట్రాఫిక్ డీసీపీ అశోక్‌కుమార్, ఏసీపీ సత్యనారాయణ, మలక్‌పేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్ మలక్‌పేట రైల్వే బ్రిడ్జి, మలక్‌పేట గంజ్, మూసారంబాగ్ బ్రిడ్జి ప్రాంతాలలో పర్యటించి పరిస్థితిని తెలుసుకున్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని పేర్కొంటూ అధికారులకు డీసీపీ పలు సూచనలు చేశారు. విజయవాడ ప్రధాన రహదారిపై అక్షయ్ హోటల్, గంజ్ గేట్ ఎదురుగా వరద నీరు చేరింది. మలక్‌పేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్ ట్రాఫిక్ సిబ్బంది, జీహెచ్‌ఎంసీ సిబ్బందితో కలిసి వరద నీరు సాఫీగా పారేందుకు చర్యలు తీసుకున్నారు. మూసారంబాగ్ బ్రిడ్జి వద్ద ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా బ్రిడ్జిపై వరదనీరు నిలిచిపోకుండా మ్యాన్‌హోళ్లను శుభ్రం చేశారు.

బీఆర్‌ఎస్‌కు ప్రజలు గుణపాఠం చెప్తారు: బీజేపీ


దిల్‌సుఖ్‌నగర్ రాజీవ్‌చౌక్ వద్ద రాస్తారోకో చేస్తున్న సామ రంగారెడ్డి తదితరులు


ఐఎస్‌సదన్ కార్పొరేటర్ జంగం మధుకర్‌రెడ్డిని హౌస్ అరెస్ట్ చేసిన పోలీసులు

ఎల్బీనగర్/ మలక్‌పేట జోన్ బృందం: రాష్ట్రంలో అప్రజాస్వామిక పాలన కొనసాగుతోందని, అరెస్టులు, నిర్బంధాలతో ప్రతిపక్షాల నోరునొక్కేందుకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం యత్నిస్తోందని మలక్‌పేట, ఎల్బీనగర్ నియోజకవర్గాలకు చెందిన బీజేపీ నాయకులు మండిపడ్డారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు బీఆర్‌ఎస్‌కు తగిన గుణపాఠం చెప్తారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బాటసింగారంలో నిర్మిస్తున్న డబుల్ బెడ్రూమ్ ఇళ్లను పరిశీలించేందుకు రాష్ట్ర బీజేపీ గురువారం 'చలో బాటసింగారం' కార్యక్రమానికి పిలుపు ఇచ్చింది. ఈ కార్యక్రమానికి అనుమతి లేదని, బీజేపీ నాయకులు అక్కడికి వెళ్లకుండా మలక్‌పేట, ఎల్బీనగర్ నియోకవర్గాలకు చెందిన పలువురు బీజేపీ నాయకులను, కార్పొరేటర్లను పోలీసులు ముందుస్తుగా గురువారం తెల్లవారుజామునే హౌస్ అరెస్టు చేశారు. మరికొందరిని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు.

పేదలను మోసం చేస్తున్న బీఆర్‌ఎస్..

మన్సూరాబాద్/చైతన్యపురి: బాటసింగారంలో నిర్మిస్తున్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పరిశీలనకు వెళ్తున్న బీజేపీ నాయకులను, కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ దిల్‌సుఖ్ నగర్‌లోని రాజీవ్‌చౌక్ వద్ద బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి ఆధ్వర్యంలో గురువారం ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రంగారెడ్డి మాట్లాడుతూ, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల ఆశ చూపి గత 9 ఏళ్లుగా పేదలను బీఆర్‌ఎస్ ప్రభుత్వం మోసం చేస్తోందని ఆరోపించారు.

కిషన్‌రెడ్డి అరెస్ట్ అమానుషం: లింగాల

సైదాబాద్: బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి అయిన కిషన్‌రెడ్డిని పోలీసులు అరెస్ట్ చేసిన తీరు అమానుషమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లింగాల హరిగౌడ్ అసహనం వ్యక్తం చేశారు. కిషన్‌రెడ్డిని అరెస్ట్‌ను నిరసిస్తూ పార్టీ కార్యకర్తలతో కలిసి సైదాబాద్‌లో ఆందోళన నిర్వహించారు.

- ఐఎస్‌సదన్ డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేతా రెడ్డి, బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డిలను వైశాలీనగర్‌లో వారి నివాసంలో పోలీసులు హౌస్ అరెస్టు చేశారు.
- సైదాబాద్‌లో నివసించే నగర మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్జీని సైదాబాద్ పోలీసులు గృహనిర్బంధంలో ఉంచారు.
- మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డిని ఎల్బీనగర్ పోలీసులు హౌస్ అరెస్టు చేశారు.
- హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి, సీనియర్ నాయకులు కళ్లెం బాల్‌రెడ్డి, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు ఎల్లప్ప, కౌన్సిలర్ శ్రీధర్‌రెడ్డిలను పోలీసులు అరెస్టు చేసి హయత్‌నగర్ స్టేషన్‌కు తరలించారు.
- బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డిని పోలీసులు అరెస్టు చేసి వనస్థలిపురం ఠాణాకు తరలించారు.
- కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్ కుమార్‌ను పోలీసులు ముందుస్తు అరెస్టు చేశారు.
- నాగోల్ కార్పొరేటర్ చింతల అరుణ-సురేంద్ర నాథ్ యాదవ్ ను నాగోలు పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు.


వనస్థలిపురం పోలీస్‌స్టేషన్‌లో కార్పొరేటర్ లచ్చిరెడ్డి

వర్షంతో మలక్‌పేట గంజ్ అతలాకుతలం


మలక్‌పేట గంజ్‌లో వాహనదారుల అవస్థలు

చాదర్‌ఘాట్: వర్షం కారణంగా మలక్‌పేటలోని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ (గంజ్) అతలాకుతలమైంది. ఇటు రైతులు, అటు వ్యాపారులు, వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. జీహెచ్ంసీ అధికారులు చూసి వెళ్లిపోయారే తప్ప సమస్య పరిష్కారం కాలేదు. నీటిలో నిలబడి ఫొటోలు తీసుకొని వెళ్తున్నారు తప్ప చేసింది ఏమీలేదని వ్యాపారస్తులు ఆరోపిస్తున్నారు. ఇంత వర్షం నీరు నిలిచినా అటు మార్కెట్ అధికారులు, మార్కెట్ కమిటీ స్పందన లేదని కిరాణాషాపు యజమానులు, రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా వర్షపునీటిని తొలగించాలని కోరుతున్నారు.

శ్రావణశ్రీ ఎన్‌క్లేవ్ వాసులకు ఇక్కట్లు..


నాగోలు శ్రావణశ్రీ ఎన్‌క్లేవ్ కాలనీలోకి వచ్చిన వరద నీరు

నాగోలు: వర్షాల వల్ల డివిజన్ బండ్లగూడ పరిధిలోని ఆనంద్ నగర్‌లోని శ్రావణశ్రీ ఎంక్లేవ్ రహదారిపై నడుము లోతు నీళ్లు ప్రవహిస్తున్నాయి. ఇలాగే వర్షం వస్తే ఏ క్షణంలో ఇళ్లలోకి నీరు చేరుతుందని భయంతో కాలనీవాసులు బిక్కు బిక్కుమంటున్నారు. 2019లో ఈ సమస్య మొదలైందని, పక్కన ఒక బిల్డర్ 5 అంతస్తుల భవన నిర్మాణం చేపట్టినప్పటి నుంచి ఈ విధంగా నీళ్లు చేరుతున్నాయని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై అధికారులకు, ప్రజా ప్రతినిధులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉపాధ్యాయులకు పీఆర్‌టీయూటీఎస్ అండ

వనస్థలిపురం: ఉపాధ్యాయులకు పీఆర్‌టీయూటీఎస్ ఎప్పుడూ అండగా ఉంటుందని, వారి సమస్యలపై పోరాడుతుందని సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కన్నయ్యగారి గోవర్ధన్ యాదవ్ అన్నారు. సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సభ్యత్వ నమోదు వారోత్సవాలను గురువారం వనస్థలిపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో సంఘం హయత్‌నగర్ మండల శాఖ అధ్యక్షుడు రాధాకృష్ణా రెడ్డి, ప్రధాన కార్యదర్శి దీన్‌దయాళ్‌రెడ్డి, రాష్ట్ర బాధ్యులు సురేంద్రరావు, గోవర్ధన్‌రెడ్డి, విజయభాస్కర్ రెడ్డి, మండల బాధ్యులు పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాల్లో భయం.. భయం

దిల్‌సుఖ్‌నగర్: గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మలక్‌పేట జోన్ పరిధిలోని లోతట్టు ప్రాంతాల్లోని కాలనీలు, బస్తీల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గురువారం ఉదయం నుంచి ఆగకుండా కురుస్తున్న వర్షానికి కాలనీలు, బస్తీలు, ప్రధాన రహదారులు జలమయం అయ్యాయి. వర్షం వల్ల డ్రైనేజీ మ్యాన్‌హోళ్ల నుంచి మురుగు బయటకు వచ్చి రోడ్లపై ప్రవహిస్తుండంతో ట్రాఫిక్ స్తంభిస్తోంది. పలు రహదారులు వరద నీటితో గోదారిని తలపించాయి.

- కొత్తపేట, మలక్‌పేట, దిల్‌సుఖ్‌నగర్, చైతన్యపురి తదితర ప్రాంతాల్లోని ప్రధాన రోడ్లపై ట్రాఫిక్ వర్షపు నీటితో ట్రాఫిక్ స్తంభించింది.
- వర్షానికి జోన్‌పరిధిలోని ఆర్‌కేపురం, దిల్‌సుఖ్‌నగర్, మలక్‌పేట, అక్బర్‌బాగ్, ఓల్డ్‌మలక్‌పేట, మున్సిపల్ కాలనీ, పద్మానగర్, కాలడేర, మలక్‌పేట రైల్వే బిడ్జి, అజంపుర, సైదాబాద్, సరూర్ నగర్, ఐఎస్‌సదన్ తదితర ప్రాంతాల్లోని కాలనీలు, బస్తీలు జలమయం అయ్యాయి.
- యాదవనగర్, అల్కాపురి, ఎన్‌టీఆర్‌నగర్, అంబేద్కర్‌నగర్, మార్గదర్శికాలనీ, శంకేశ్వరబజార్, వాంబేకాలనీ తదితర ఈప్రాంతాల్లోని నాలాలు పూర్తిగా పూడుకుపోయి మురుగునీరంతా రోడ్లపై కాలనీల్లో ప్రవహిస్తోంది.

పొంగిపొర్లుతున్న డ్రైనేజీలు

- జోన్ పరిధిలోని కాలనీలు, బస్తీల్లో డ్రైనేజీలు పొంగిపొర్లుతుండటంతో స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ఆర్‌కేపురం, సరూర్‌నగర్, ఓల్డ్‌మలక్‌పేట, అక్బర్‌బాగ్, మూసారంబాగ్, సైదాబాద్, కుర్మగూడలో డ్రైనేజీ పైప్‌లు లీకై ఎక్కడి డ్రైనేజీ అక్కడనే పొంగిపొర్లుతోంది.


లింగోజిగూడ డివిజన్ అల్తాఫ్‌నగర్ కాలనీలో..


అల్తాఫ్‌నగర్‌లో...

జలదిగ్బంధంలో అల్తాఫ్‌నగర్

భారీ వర్షాలతో లింగోజిగూడ డివిజన్ పరిధిలోని లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. అల్తాఫ్‌నగర్ కాలనీలో రోడ్డుపై భారీగా వరద నీరు ప్రవహిస్తోంది.పలు ఇళ్లలోకి నీరు చేరింది. స్థానిక కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ ఏఈ విజయ్‌కుమార్‌లు కాలనీలో పర్యటించి పరిస్థితిని చక్కదిద్దేందుకు చర్యలు తీసుకున్నారు.

– లింగోజిగూడ


అల్తాఫ్‌నగర్‌లో వరద ఉధృతికి కూలిన ఓ ఇంటి ప్రహరీ


అల్తాఫ్‌నగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, ఏఈ విజయ్‌కుమార్

ఎర్రగుంట శ్మశానవాటికను మహాప్రస్థానంలా అభివృద్ధి చేయండి

మంత్రి కేటీఆర్‌కు సింగిరెడ్డి స్వర్ణలతారెడ్డి వినతి


మంత్రి కేటీఆర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న సింగిరెడ్డి స్వర్ణలతారెడ్డి

సైదాబాద్: ధోబీఘాట్ చౌరస్తాలోని ఎర్రగుంట హిందూ శ్మశానవాటికను మహాప్రస్థానం తరహాలో అభివృద్ధి చేయాలని సైదాబాద్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి స్వర్ణలతారెడ్డి కోరారు. ఈ మేరకు అఖిలపక్ష నాయకులతో కలిసి గురువారం ఆమె రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్‌ను ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. సైదాబాద్‌లో 16 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఎర్రగుంట చెరువు, హిందూ శ్మశానవాటిక ఇప్పటికే పలు ఆక్రమణలకు గురయ్యిందన్నారు. శ్మశానవాటికలో రుసుములు ఇష్టారాజ్యంగా వసూలు చేస్తున్నారని వారు వివరించారు.ఎర్రగుంట హిందూ శ్మశానవాటిక సంక్షేమ సమితి వినతి మేరకు ఇటీవల ఆర్‌డీఓ ఇక్కడ రీసర్వే చేసి స్థలాన్ని జీహెచ్‌ఎంసీకి అప్పగించారని తెలిపారు. ఇప్పటికైనా రెవెన్యూ, జీహెచ్‌ఎంసీ అధికారులు ఎర్రకుంట చెరువు స్థలాన్ని పరిరక్షించేలా ఆదేశాలివ్వాలని వారు మంత్రిని కోరారు. శ్మశానవాటికను జీహెచ్‌ఎంసీ స్వాధీనం చేసుకొని అందరికీ అందుబాటులో రుసుములు ఉండేలా ఆదేశాలు జారీ చేయాలని వారు కోరారు.మంత్రిని కలిసిన వారిలో శ్రీకాంత్‌రెడ్డి, పగిళ్ల శ్రీనివాస్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, అంజిరెడ్డి పాల్గొన్నారు.

అత్యవసరమైతేే తప్ప బయటకు రావద్దు: ఎమ్మెల్యే



నాగోలు గ్రామంలో జరుగుతున్న ఎస్‌ఎన్‌డీపీ నాలా పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

నాగోలు: ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నందు వల్ల ప్రజలందరూ ఇంటి వద్దే ఉండాలని, అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి కోరారు. గతంలో వచ్చిన వరదల వల్ల జరిగిన అనర్థాలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ఎస్‌ఎన్‌డీపీ కాలువల నిర్మాణం చేపట్టి వరద నివారణకు చర్యలు తీసుకుందన్నారు. దీంతో ముంపు ప్రాంతాల ప్రజలకు ఉపశమనం కలుగుతుందని సుధీర్ రెడ్డి తెలిపారు. ఆయన గురువారం నాగోలు డివిజన్ పరిధిలోని వెంకటరమణ కాలనీ, మమతా నగర్, నాగోల్ ఓల్డ్ విలేజ్‌లో జరుగుతున్న ఎస్‌ఎన్‌డీపీ పనులను అధికారులు, కాంట్రాక్టర్‌తో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, ఈ సందర్భంగా స్థానికులు తమ తాగునీటి సరఫరా వ్యవస్థ ధ్వంసమైందని, తాగునీటి సౌకర్యం కల్పించాలని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని కోరారు. కాలనీ విద్యుత్ స్తంభం ఒరిగిపోయిందని, ప్రమాదం జరగకముందే కొత్త స్తంభం ఏర్పాటు చేయాలని కోరారు. వెంటనే కాంట్రాక్టర్‌ను పిలిపించిన ఎమ్మెల్యే.. ఇన్ని రోజులూ తాగునీటి సౌకర్యం కల్పించకుండా ఎందుకు నిర్లక్ష్యం చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. వర్షం తగ్గిన వెంటనే తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని ఆదేశించారు. ప్రజలు బయటకు వచ్చినప్పుడు కరెంటు స్తంభాలను ముట్టుకోవద్దని, నానిపోయిన, పాడుబడిన ఇళ్లలో నివాసం ఉండవద్దని ప్రజలను ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో అధికారులు కృష్ణయ్య, నాగోల్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

'సాక్షి' కథనానికి స్పందించిన ఎమ్మెల్యే...

మళ్లీ వరద ముంపు తప్పదా? అనే శీర్షికతో గురువారం సాక్షిలో వచ్చిన కథనానికి స్పందించిన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి నాగోలు గ్రామంలో అధికారులతో కలిసి పర్యటించారు. గ్రామంలో కొనసాగుతున్న వరదనీటి నాలా పనులను పరిశీలించారు. కాలనీవాసులకు వెంటనే తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

కష్టపడే వారికి బీఆర్‌ఎస్‌లో సముచిత స్థానం


మంత్రి సబితారెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేసిన నాయకులు

దిల్‌సుఖ్‌నగర్: కష్టపడే వ్యక్తులకు బీఆర్‌ఎస్ పార్టీలో సముచిత స్థానం ఉంటుందని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. గురువారం ఆర్‌కేపురం డివిజన్ ఎన్టీఆర్ నగర్ ఫేస్–2కు చెందిన బీజేపీ కార్యకర్తలు పలువురు మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. మంత్రి వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించింది. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ, పార్టీని మరింత బలోపేతం చేయాలని, పార్టీ కోసం కష్టపడే వారికి సముచిత స్థానం కల్పిస్తామన్నారు. అనంతరం పార్టీలో చేరిన కార్యకర్తలు మాట్లాడుతూ, మహేశ్వరం అభివృద్ధి మంత్రి సబితారెడ్డితోనే సాధ్యమని గ్రహించి బీఆర్‌ఎస్‌లో చేరామన్నారు. కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గ జనరల్ సెక్రెటరీ మురుకుంట్ల అరవింద్ శర్మ, ఆర్‌కేపురం పార్టీ అధ్యక్షుడు పెండ్యాల నాగేష్, సాజిద్, లాల్ మహమ్మద్, గొడుగు శ్రీనివాస్, రామాచారి, లింగస్వామి గౌడ్, కంచర్ల శేఖర్, జగన్మోహన్ రెడ్డి,పెంబర్తి శ్రీనివాస్, కొండ్ర శ్రీనివాస్, వెంకటేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.